క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక జరిగాయి. సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుము లదొడ్డి ఆంజనేయ స్వామి దేవాలయం , అగసలదిన్నెలోని అంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి వారం కావడంతో భక్తులు తరలివచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. తెల్లవారుజామున 5 గంటకు అర్చకులు వాయుపుత్రుడుకి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలు చేపట్టారు. అలాగే మండల కేంద్రంలోని అంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

శ్రీమఠంలో జిల్లా న్యాయమూర్తి

మంత్రాలయం:రాఘవేంద్ర స్వామి దర్శనార్థం జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనివాసులు శనివారం రాత్రి మంత్రాలయం విచ్చేశారు. శ్రీమఠం అధికారులు ఆహ్వానం పలుకగా ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూలబృందావనాన్ని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేసి, రాఘవేంద్రుల రథోత్సవంలో పాల్గొన్నారు.

కేటాయించిన రూట్లలో చెత్త సేకరించాలి

ఆదోని టౌన్: పట్టణంలోని 42 వార్డుల పరిధిలో ట్రక్కులకు కేటాయించిన రూట్లలో వెళ్లి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ట్రక్కుల డ్రైవర్‌లను ఆదేశించారు. శనివారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ట్రక్కుల డ్రైవర్‌లకు సూచనలు చేశారు. కొంతమంది ట్రక్కుల డ్రైవర్లు నిర్దేశించిన రూట్లలో సమయానికి వెళ్లకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మొక్కజొన్న విక్రయాలకు పేర్లు నమోదు చేసుకోండి

పెద్దకడబూరు: మొక్కజొన్న పంటకు ప్రభుత్వ గిట్టుబాటు ధర కల్పిస్తుందని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ మొక్కజొన్న సాగుచేసిన రైతులు తమ దిగుబడిని విక్రయించుకోవడానికి తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్టర్ చేసుకున్న రైతుల నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ క్వింటా రూ.1962 మద్దతు ధరతో కొనుగోలు చేస్తారని చెప్పారు. కొత్తగా రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేసుకునే రైతులు మే నెల 3వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. రైతుభరోసా లబ్ధిదారులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబసభ్యులకు వర్తించడానికి మరణ ధ్రువ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

పేదల అభివృద్ధికి పథకాలు

కౌతాళం: బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి చేసేందుకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు ఈరన్న అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనను వివరించి ప్రజల అభిప్రాయాలను సేకరించారు.

'ఉపాధి' పనులు కల్పించాలి

ఆదోని రూరల్ : మండలంలోని చాగి గ్రామంలో ఉపాధి పనులు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, తక్షణమే పనులు చూపాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న కోరారు. కూలీలు పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నా పనులు కల్పించడంలేదని కూలీలు వాపోతున్నారని చెప్పారు. ఏపీఓ, ఎంపీడీఓ చొరవ తీసుకొని వెంటనే గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని కోరారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అర్బన్ : వేసవి సెలవుల్లో తరగుతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఢణాపురం ఉదయ్ విద్యాశాఖ అధికారులను కోరారు. శనివారం ఆయన ఆదోని ఆర్ట్స్ కళాశాలలో డీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కొందరు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు.

వేబ్రిడ్జి కాటా తనిఖీ

ఆదోని అర్బన్ : పట్టణంలోని అర్థగేరి బస్టాండు పక్కనున్న బాలాజీ వే బ్రిడ్జి కాటాను శనివారం సాయంత్రం అసిస్టెంట్ కంట్రోలర్ తూనికల కొలత శాఖ అధికారి శ్రీరాములు తనిఖీ చేశారు. అయితే తనిఖీలో 30 కేజీలు ఎక్కువగా ఉండడంపై కాటా యజమానిపై కేసు నమోదు చేశారు. శ్రీరాములు మాట్లాడుతూ అవకతవకలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలనిని ప్రజలను కోరారు.

జోరుగా వరి కోతలు

- ఆశాజనకంగా దిగుబడులు
- గిట్టుబాటు ధరతో రైతుల ఆనందం

మంత్రాలయం : రెండోకారు వరి పంట కోతలు జోరుగా సాగుతున్నాయి. తుంగభద్ర నది తీరం వరికోత యంత్రాల సవ్వడులు, కూలీల సందడితో కనువిందు చేస్తోంది. వరి పైర్ల సాగు మెండుగా ఉండటంతో పంటలు సమృద్ధిగా పంటలు చేతికందాయి. ఆశాజనకంగా దిగుబడి, గిట్టుబాటు ధరలు లభిస్తుడడంతో రైతన్నల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

వరి సాగు వివరాలు..

మంత్రాలయం నియోజకవర్గంలో గురురాఘవేంద్ర, పులికనుమ ప్రాజెక్టులతో పాటు ఏపీఐడీసీ పరిధిలో 19 లిఫ్ట్ ఇరిగేషన్లు ఉన్నాయి. ఎత్తిపోతల పథకాల పరిధిలో దాదాపు 20 కి.మీ. తీరం ఉంది. అలాగే నదీ తీరం పరిధిలో 4 వేల ఎకరాల్లో వరి సాగైంది. గుడికంబాళి, మేళిగనూరు, మరళి, కుంబళనూరు, కుంబళనూరు క్యాంపు, సాతనూరు, కందకూరు, అగసనూరు, తుంబిగనూరు, నారాయణపురం, కాచాపురం, తుంగభద్ర, రాంపురం, మాధవరం, చెట్నెహళ్లి, మంత్రాలయం గ్రామాల్లో తీరం వెంట వరి కోతలు మొదలయ్యాయి.


వరి పంటను కోస్తున్న యంత్రం


కల్లాల్లో వరి ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

ఆశాజనకంగా దిగుబడి..

తీరంలో అత్యధికంగా ఆర్ఎన్ఆర్ రకం వరి పంటను సాగు చేశారు. ఎకరాకు 40 నుంచి 45 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా ధర రూ.2,200 నుంచి రూ.2,300 వరకు లభిస్తుంది. ఖర్చులు పోనూ ఎకరాకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఆశాజనకంగా దిగుబడులతో పాటు ధరలు లభిస్తుండటంతో రైతన్నలు కష్టాల నుంచి గట్టెక్కుతున్నారు.

ఎన్నడూ లేని విధంగా ధర



మూడు ఎకరాల్లో వరి సాగు చేశా. వరి సాగులో ఆదాయం రావడం ఎంతో కష్టం. రెండోకారు పంట బాగానే వచ్చింది. ఎకరాకు 40 బస్తాల మేర దిగుబడి వచ్చింది. క్వింటా రూ.2,200 చొప్పున అమ్మాను. ఎన్నడూ లేని విధంగా ధర లభించడంతో సంతోషంగా ఉంది.

– ప్రహ్లాద, అగసనూరు

400 బస్తాల దిగుబడి



నాకున్న 10 ఎకరాల్లో వరి పంట వేశాను. ఎకరాకు 40 చొప్పున 400 బస్తాల దిగుబడి వచ్చింది. వరి ఈ ఏడాది మంచి రేటు పలుకుతోంది. క్వింటా రూ. 2,250 ప్రకారం విక్రయించాను. ఈ సారి రేట్లు బాగా ఉండటంతో వరి సాగులో ఆదాయం చూశాం.

– అనిల్‌కుమార్, కుంబళనూరు క్యాంపు

క్లైం కాని భూములకు పరిష్కారం

కౌతాళం: క్లైం కాని విస్తీర్ణ భూములకు మహర్దశ కలిప్తామని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో క్లైం కాని విస్తీర్ణానికి సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ఈ భూముల వల్ల రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, భూమిని సాగు చేస్తున్న క్లైం కాని విస్తీర్ణంగా ఉండటంతో రైతులకు ఆన్‌లైన్‌లో వారి పేర్లు లేక అడంగల్, వన్‌బీలు లేక పోవడంతో రైతులకు రుణాలు లభించక పోవడంతో పాటు రైతు భరోసా, క్రాప్ ఇన్సూరెన్స్ కూడా అందడం లేదు. దీంతో ప్రభుత్వం ఈ భూముల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించడంతో మండలంలోని మొత్తం 36 గ్రామాల్లో క్లైం కాని భూములు 4,793 ఎకరాలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. మండల కేంద్రమైన కౌతాళంలో 298 ఎకరాలు ఉన్నట్లు గుర్తించామని, అలాగే హాల్వి గ్రామంలో 496 ఎకరాలు, బదినేహాల్‌లో 493 ఎకరాలు, కామవరంలో 485 ఎకరాలు, ఏరిగేరి గ్రామంలో 300 ఎకరాలు, తోవిలో 190 ఎకరాలు, ఉరుకుందలో 160 ఎకరాలు, చిరుతపల్లి గ్రామంలో 180 ఎకరాలు ఉన్నాయని, మండలంలో మొత్తం 4,793 ఎకరాలు ఉన్నట్లు తేలిందని, ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లా అధికారులకు పంపామని, వారి ఆదేశాల వచ్చిన తరువాత ఈ భూములకు ఆన్‌లైన్ ద్వార ఆయా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తామని స్పష్టం చేశారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం రాష్ట్రాన్ని తీర్చిదిద్దేది జగనన్నే


పథకాల అమలుపై మహిళతో వివరాలు తెలుసుకుంటున్న వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం : పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిలకలడోణ గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్ స్తంభాలు, సమస్యగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థాన భ్రంశం, సీసీ రోడ్లు కావాలని ఎస్సీ కాలనీవాసులు కోరారు. ఆయన స్పందిస్తూ త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రజా శ్రేయస్సు ధ్యేయంగా జననన్న పాలన సాగిస్తున్నారని వివరించారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా తదితర నవరత్నాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని గుర్తు చేశారు. ఇవేవీ తెలియని టీడీపీ నేతలు ప్రభుత్వంపై బురదజల్లడం విచారకరమన్నారు. లోకేశ్ యువగళం యాత్రలో నోరుపారేసుకుంటున్నారని దుయ్యబట్టారు. సొంత పార్టీ నేతలతోనే ముఖాముఖి నిర్వహిస్తూ తప్పుడు ప్రచారాలకు పాటుపడటం సిగ్గుచేటన్నారు. అబద్ధాల ఊరేగింపులతో ఒరిగేదేమి లేదని హితవు పలికారు. గ్రామంలో తాగునీటి సమస్యకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశమయ్యారు. గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. వలంటీర్లు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ భీమిరెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేద స్వరూప, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు, ఏపీఎం జయశ్రీ, పంచాయతీ కార్యదర్శి ఇస్రాత్ బాషా పాల్గొన్నారు.

ఆదోని టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్ద గలరని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఇప్పటివరకు పాలించిన నేతలతో పోలిస్తే జగనన్న ఎంతో మేలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు చూడని సంక్షేమ పథకాలు, అభివృద్ధితో ముందుకెళ్తున్నారన్నారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ।జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆదోనికి 22వ స్థానం దక్కిందన్నారు.ఇది ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారం చూపుతూ ముందుకు సాగుతున్నారన్నారు. 1.65 కోట్ల మంది లక్ష్యంగా చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేలో 1.01 కోట్ల మంది పాల్గొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ మద్దతును తెలియజేశారన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఇళ్ల పట్టాల పంపిణీ..

పట్టణంలోని 26వ వార్డుకు చెందిన 44 మంది నిరుపేద మహిళలకు ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పంపిణీ చేశారు. మొత్తం 219 మంది కాగా, ఇప్పటివరకు 160 మందికి పట్టాలు ఇచ్చి పక్కా ఇల్లు మంజూరు చేశామన్నారు. పలు వార్డుల్లో పట్టాలు పంపిణీ చేయాల్సి ఉందని, వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రి ఏరియా, 21వ వార్డు శివశంకర్‌నగర్ ప్రాంతంలో ఆది, సోమవారాల్లో పంపిణీ చేస్తామని చెప్పారు. మే 9వ తేదీ నుంచి ।జగనన్నకు చెబుదాం॥ కార్యక్రమం అమలు చేస్తారని, ఇందులో సమస్యలతో ఇబ్బందులుపడే ప్రజలు కాల్ చేస్తే నేరుగా సీఎం మాట్లాడతారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వార్డు ఇన్‌చార్జి రాముడు, నాయకులు లక్ష్మన్న, మల్లి, వీరేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

హొళగుంద: అక్రమంగా మద్యం రవాణా చేస్తే ఉపేక్షించమని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. హొళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన 27 వాహనాలకు శనివారం వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వేలం ద్వారా వచ్చిన నగదును ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హొళగుంద, హాలహర్వి ఎస్ఐలు వల్లెపు శ్రీనివాసులు, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంక్ సరే.. కనెక్షన్ ఏదీ?

ఆదోని అర్బన్: పట్టణంలోని విక్టోరియాపేటలో సంవత్సరం క్రితం ట్యాంకు ఏర్పాటు చేసి బోరుకు మోటార్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. దీంతో ట్యాంకు నిరుపయోగంగా మారింది. వేసవిలో ఆయా ప్రాంతాల్లో సరఫరా అవుతున్న నీరు సరిపోవడం లేదని స్థానికులు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు చెబుతున్నారు. కావున నీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలంటే మోటార్ కనెక్షన్ ఇచ్చి ట్యాంక్‌కు నీటినిసరఫరా చేయాలని కోరుతున్నారు.


కుళాయి కనెక్షన్ ఇవ్వకుండా వృథాగా వదిలేసిన ట్యాంకు

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు


ప్రభుత్వ బాలుర–1 సెంటర్‌లో పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు


కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయ్ కుమార్

ఆలూరు రూరల్: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలు శనివారం ఆలూరులో ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ బాలుర–1, బాలుర–2 పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాలుర–1 కేంద్రంలో 288 మంది విద్యార్థులకు గాను 246 మంది హాజరయ్యారు. బాలుర–2 సెంటర్‌లో 226 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 196 మంది పరీక్షలు రాసినట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్‌లు రమణయ్య, కరిబసప్ప తెలిపారు. రెండు సెంటర్లలో కలిసి 514 మందికి గాను 442 హాజరయ్యారు. 72 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నవోదయ ప్రవేశ పరీక్షలను ఆలూరు తహసీల్దార్ విజయ్ కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించి సెంటర్ల వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన నవోదయ ప్రవేశ పరీక్షలను తహశీల్దార్ జయన్న పరిశీలించారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

వెల్దుర్తి: రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు మే 3వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ అక్బర్ బాషా తెలిపారు. శనివారం ఆయన మండల పరిధిలోని రత్నపల్లె, నర్సాపురం, లక్ష్మీనగరం గ్రామాల ఆర్బీకేలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు పరిశీలించి అందిస్తున్న సేవల వివరాలు ఆర్బీకే సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి ఈనాము, దేవదాయ భూములు, అటవీ భూములు సాగు చేసేవారు, అగ్రిమెంట్లు కలిగిన వారు సైతం అర్హులని చెప్పారు.

ఆర్థికంగా ఎదగాలి


ఐచర్ వాహనాన్ని అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: మత్స్యకారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చెప్పారు. దేవనకొండ మండలం కుంకనూరు గ్రామానికి చెందిన వీరేష్ అనే వ్యక్తికి ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజక ప్రోత్సాహం పథకం కింద మంజూరైన ఈచర్ వాహనాన్ని శనివారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమానికి సర్కారు అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. సబ్సిడీపై వాహనాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామలమ్మ, ఎఫ్‌డీఓ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపుదాం

హొళగుంద: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న మతోన్మాద బీజేపీ పార్టీని సాగునంపుదామని సీపీఐ మండల సహాయ కార్యదర్శులు పెద్యాట మారెప్ప, రంగన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యుడు పెద్యాట శ్రీరంగ పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ఎల్లార్తి, చిన్నహ్యాట, బీజీ హళ్లి గ్రామాల్లో రెండవ రోజు ప్రచార భేరి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ పాలనలో కార్మికులు, రైతులు, కూలీలు దుర్భర పరిస్థితిని అనుభవిస్తున్నారని వాపోయారు. ప్రధాని మోదీ వంటగ్యాస్, నిత్యావసర ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు కోరారు. కార్యక్రమంలో నాయకులు సలాంసాబ్, మౌలాసాబ్, ఇనాహిత్, వెంకన్న, నూర్‌బాషా, మస్తాను, అశోక్, యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

అతిసారం.. అప్రమత్తం

- ఆలూరు, హొళగుంద మండలాల్లో పలువురికి వాంతులు, విరేచనాలు
- అప్రమత్తమైన అధికార యంత్రాగం
- గ్రామాల్లో హెల్త్‌క్యాంపుల ఏర్పాటు
- తాగునీటి ట్యాంకుల శుభ్ర, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి


ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న అతిసారం బాధితులు

ఆలూరు రూరల్: గ్రామాల్లో అతిసారం (డయేరియా) ప్రబలుతోంది. వివిధ కారణాలతో ఆలూరు నియోజకవర్గంలోని ఆలూరు, హొళగుంద మండలాల్లో వారం రోజుల నుంచి ప్రజలు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు. పలువురు ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. సమస్య తీవ్రం మవుతుండటంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. హొళగుంద మండలంలోని నెరణికి, నెరణికి తండా గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేశారు. డాక్టర్లు ఆయా గ్రామాల్లోనే ఉండి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. తాగునీటి సరఫరా అధికారులు, పంచాయతీ అధికారులను అప్రమత్తం చేసి ట్యాంకులు శుభ్రం చేయిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యలోపం లేకుండా వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. వ్యాధి ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నారు. వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలని, చిన్న పిల్లలు,వృద్ధులు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

24 గంటలూ వైద్య సేవలు

వాంతులు, విరేచనాలతో వస్తున్న రోగులకు సీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని కోలుకునేవరకు పర్యవేక్షిస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే వారిలో వృద్ధులు చిన్న పిల్లలు అధికంగా ఉన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఇప్పటి వరకు 32 మంది డయేరియా లక్షణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు వైద్యులు చెప్పారు. నెరణికి గ్రామంలో ఒకే ఇంట్లో నలుగురు డయేరియాతో ఆస్పత్రిలో చేరారు. బుధవారం డీఎం అండ్ హెచ్‌ఓ రామగిడ్డయ్య నెరణికి గ్రామంలో పర్యటించారు. తీవ్రమైన ఎండలు, కలుషితమైన తాగునీరు, ఆహారంతో డయేరియా వ్యాధి సోకుతున్నట్లు వెల్లడించారు. బాధితులు ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు.


నెరణికిలో తాగునీటి ట్యాంక్ శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు


నెరణికిలో గ్రామస్తులకు ఆరోగ్య సూచనలు ఇస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ రామగిడ్డయ్య (ఫైల్)

డయేరియా వ్యాధి లక్షణాలు..

- తీరిక లేకుండా నీళ్ల విరేచనాలు
- విపరీతమైన కడుపునొప్పి
- ఆహారం జీర్ణం కాకుండా వాంతులు
- బీపీ పూర్తిగా తగ్గిపోవడం
- షుగర్ లెవల్స్ పడిపోతాయి
- చర్మం మొత్తబడిపోతుంది
- తీవ్ర నీరసం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఎండలు ఉన్నప్పుడు బయటికి వెళ్లరాదు
- వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలి
- బీపీ,షుగర్ పడిపోకుండా చక్కెర, ఉప్పు కలిపిన నిమ్మరసం తీసుకోవాలి
- రోజుకు 4–5 లీటర్ల నీరు తాగాలి
- పళ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలి
- ఎక్కువగా మజ్జిగ అన్నాన్ని ఆహారంగా తీసుకోవాలి

అప్రమత్తంగా ఉండాలి



తీవ్రమైన ఎండలు, కలుషిత నీరు తాగడంతో డయేరియా సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన వారికి విరేచనాలు, వాంతులు అవుతాయి. ప్రతి రోజు రెండు నుంచి మూడు కేసులు నమోదవుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. వేడిచేసి చల్లార్చిన నీరు తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి. ఎండలకు తిరగరాదు. రోజుకు 5 లీటర్ల నీరు తాగాలి. చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– లక్ష్మీనారాయణ, సీహెచ్‌సీ వైద్యుడు, ఆలూరు